మాచిరాజు కామేశ్వరరావు

# అభ్యర్థన ఓ గులాబీతో!




"హూఫెనవర్ మోర్!" నిశ్శబ్దంగా వున్న హాలు ఉలిక్కి పడేలా అరిచాడు సారథి.

ఆ మాటతో హాలులో ఉన్న ఇరవైనాలుగు మంది చేతుల్లోకి విద్యుత్ వచ్చినట్లయ్యింది! ఉద్వేగం పెరిగింది. వ్రాస్తున్న వేగం హెచ్చింది.

సారథి అటూఇటూ పచార్లు చేస్తున్నాడు.

పేపరు అందుకున్నప్పట్నించీ తలవంచుకుని ఏకబిగిన రాస్తున్న ఆమె సీటు దగ్గిర క్షణం ఆగాడు!

ఆమె తలెత్తి ఓసారి అతడి కళ్లల్లోకి చూసింది. చిన్నగా నవ్వినట్లుగా ఆమె పెదవులు విచ్చుకున్నాయి. రెండున్నర గంటలుగా ఏకబిగిన రాస్తున్న ఆమె అందమైన మొహం లో అలసట!

సన్నగా,పొడవుగా,తెల్లగా,నాజూగ్గా వున్న ఆమె చేతి వేళ్ల వేగం చూస్తే ఆశ్చర్యంగా ఉంది సారథికి.

అతను వెనుదిరిగి రెండు అడుగులు వేసేసరికి, "...సార్...కొద్దిగా మంచినీళ్లు!" వినీ వినపడనట్లుగా గొంతు.

సారథి గుమ్మం బయటకు వెళ్లి, కారిడార్లో గాజుగ్లాసుల్లోకి నీళ్ల నింపుతున్న బాయ్ ని పిలిచాడు.

ఆమె టైమ్ లేనిదానిలా సగం గ్లాసుడు నీళ్లు తాగి, గ్లాసును టేబులు చివర పెట్టింది.

"థాంక్స్" మరచిపోయినదానిలా చప్పున తలెత్తి సారథి వైపు చూసి, మరుక్షణం వ్రాయడంలో మునిగి పోయింది ఆమె.

సారథి హాల్ టికెట్స్ ని ఆర్డర్ లో పెడుతూ ఆమె పేరు చూశాడు.—శ్రావణి! పరిచితమైన పేరు.

రాస్తున్న వారి గుండెలు అదిరేలా బెల్ మోగింది. "ఫైవ్ మినిట్స్ మోర్"వాచ్ చూసుకుంటూ అరిచాడు సారథి.

రాస్తున్న వాళ్ల చేతుల్లో కొత్త బలం వచ్చింది. ఈ అయిదు నిముషాల్లోనే ఎంతో రాసేయాలని తాపత్రయం.

"స్టాప్!"మొదటి బెంచీ అబ్బాయి చేతిలోని పేపర్లు లాక్కున్నాడు సారథి.

"ప్లీజ్ డోన్ట్ రైట్ ఎనీమోర్!" గబగబా పేపర్లు లాక్కుంటూ ఆమె దగ్గరకు వచ్చాడు.

"ఆల్ ద బెస్ట్!" ఆమె పేపర్లను అందుకుంటూ అప్రయత్నంగా అన్నాడు అతను.

* * *

ఇంటి ముందున్న గులాబీ మొక్కలకి పైప్ తో నీళ్లు పెడుతున్నాడు సారథి.

సాయంసంధ్యలోఅన్ని రంగుల గులాబీలు కొత్త అందాల్ని పులుముకున్నాయి.

సారథికి చిన్నతనంనుంచీ గులాబీలంటే ప్రాణం! జీవితంలో ఓచిన్న ఇల్లూ,దాని

ముందు ఓగులాబీ తోట ఏర్పాటు చేసుకో వాలని కాలేజీలో ఉండగానే కలలు కనేవాడ తను. బ్యాంకు ఉద్యోగంలో చేరిన ఆరేళ్లకి అతని కల నిజమయ్యింది. అతనికొచ్చిన బ్యాంకు లోనుకి మూడు గదుల ఇల్లు మాత్రమే కట్టగలిగాడు. ఇంటి ముందు అన్ని రకాల గులాబీ మొక్కలు వేసుకుని అతని స్వప్నం నిజం చేసుకున్నాడు!

అన్ని మొక్కల్నీ నీటితో తడపడం అయ్యింది. మళ్లీ కుళాయి బంద్ అవుతుందని గబగబా లోనికెళ్లి చన్నీళ్ల స్నానం చేశాడు. తెల్లని లాల్చీ పైజామా వేసుకుని వీధి అరుగుమీదకు వచ్చాడు సారథి.

"బొత్తిగా ఏమీతోచడం లేదు!" అనుకుంటూ అరుగు దిగి వీధి గేటు దగ్గరకెళ్లి నిల్చున్నాడు!

వీధిలో జనం పల్చగా మసలుతున్నారు.

"సార్ మీరిక్కడేనా ఉండేది?" మెయిన్ రోడ్డు కేసి చూస్తున్న సారథి, తల తిప్పి చూశాడు. గేటు అవతల పసుపు రంగు చీరలో శ్రావణి!

"అ ఇక్కడే! ఇదే మా ఇల్లు! మీ ఇల్లు కూడా ఈవీధిలోనేనా?"

"ఈ వీధి చివర మామేనత్త వుంది. నేను ఈ పరీక్ష రాయడానికి రాజమండ్రి నుంచి వచ్చాను. రేపు గౌతమికి వెళ్లి పోతాను!"

"అలాగా"

ఇద్దరి మధ్య క్షణకాలం మౌనం.

"అబ్బ ఎన్ని రకాల గులాబీలు!ఐ అప్రిషియేట్ యువర్ టేస్ట్! నాకు ఎల్లో కలర్ గులాబీ అంటే ప్రాణం! " అంటున్న, గులాబీ పువ్వులా వున్న శ్రావణి కళ్లల్లోకి కొత్త మెరుపు వచ్చింది.

"నాకు కూడా! పూలకు రాణి గులాబీ' అంటాను నేను"

"గులాబీ అందాలు లేని ప్రకృతిని ఊహించుకోలేము!"

"గులాబీల సున్నిత మైన సువాసనంటే నాకు మరీ ఇష్టం!"

"మీరు ఏమీ అనుకోకపోతే ఓగులాబీ...అదే ఎల్లో కలర్ ది..." మొహమాటంగా ఆగిపోయింది శ్రావణి.

"ఓ తప్పకుండా!" అన్ని పూలల్లోకి ప్రత్యేకంగా తల ఎత్తుకుని గర్వంగా కదులుతున్న ఎల్లో కలర్ గులాబీని రెండు ఆకుల సహితంగా తుంచాడు సారథి.

ఆ ఎల్లో గులాబీ వైపే ఆరాధనగా చూస్తోంది శ్రావణి.

గులాబీ ఆమె చేతికివ్వబోతూ "నాదో చిన్న రిక్వెస్ట్" అన్నాడు సారథి.

"చెప్పండి" అంటూ నవ్వుతూ గులాబీ కోసం చేయిచాపింది శ్రావణి.

"రేపు సాయంత్రం మీరు తప్పకుండా మాఇంటికి రావాలి!" గులాబీని ఆమె నాజూకైన చేతులకందించాడు సారథి.

ఆమె నవ్వుతూ "రేపటిదాకా ఎదుకు? ఇపుడే వస్తాను!" అంది.

"ఇపుడు మా ఆవిడ ఇంట్లో లేదు. రేపు పొద్దున గోదావరికి వస్తుంది మీరు వెళ్లేది రాత్రి గౌతమికి కదా! కాబట్టి సాయంత్రం తప్పకుండా రావాలి!" అన్నాడు సారథి.

"రేపు కొంప దీసి మీ బర్త్ డే కాదు కదా! "

"అటువంటిదేమీ లేదు"

"మరి ప్రత్యేక ఆహ్వానం ఎందుకో మరి! "

"ఏమీ అడగొద్దు. రేపు మీకోసం ఎదురు చూస్తుంటాం!" వినయంగా అన్నాడు సారథి.

"అలాగే రేపు మరో పసుపు రంగు గులాబీ ఇస్తానని మాటిస్తే తప్పకుండా వస్తాను!"గలగలా నవ్వుతూ అంది శ్రావణి.

"తప్పకుండా!" ఆమె నవ్వుతో శ్రుతి కలిపాడు సారథి.

* * *

స్నానం చేసొచ్చి ఒంటిమీద పౌడర్ చల్లుకుంటుంటే కాలింగ్ బెల్ మోగింది.

"శ్రావణి వచ్చినట్లుంది"అనుకుని గబగబా లాల్చీ వేసుకున్నాడు.

సారథి భార్య సంధ్య తలుపు తీసి"ఎవరు మీరు? ఎవరి కోసం?" అని అడిగింది.

డ్రెస్సింగ్ టేబుల్ మీదున్న వాచీ తీసుకుని చేతికి పెట్టుకుంటూ ముందు గదిలోకి వచ్చాడు సారథి. "హల్లో శ్రావణి గారు! గుమ్మం లోనే నిలబడి పోయారేం? లోనికి రండి!"హుషారుగా పలకరించాడు.

"ఈవిడే శ్రావణి గారు," భార్యకు పరిచయం చేసి," కొంచం నిమ్మ రసం కలుపు సంధ్యా !" అన్నాడు.

శ్రావణికి నమస్కారం చేసి లోపలికి వెళ్లింది సంధ్య.

"కూర్చోండి!"అన్నాడు.

సోఫాలో కూర్చున్న శ్రావణి, గదిలో గోడకున్న పెయింటింగ్స్ ని, కిటికీలకున్న పరదాలనీ చూసింది.

సారథికి ఏం మాట్లాడాలో తోచడం లేదు.

"మీరింత చిన్న వయసులోనే ఇన్విజిలేటర్ గా ఎలా వచ్చారు?" రెండు రోజులుగా శ్రావణి అడగాలనుకుంటున్న ప్రశ్నను అడిగింది.

"ఇన్విజిలేషన్ కి వయసుతో పని లేదు. సాధారణంగా బ్యాంక్ ఉద్యోగులనీ, లెక్చరర్స్ ని పిలుస్తారు. ఉత్సాహం ఉన్న వాళ్లు రావచ్చు. ముందు రోజు కొంచెం ట్రైనింగ్ ఇస్తారు. ఇన్విజిలేషన్ చేసినందుకు యాభై రూపాయల పారితోషికం కూడా ఉంటుంది తెలుసా?"

తెలియదన్నట్లు తల ఊపింది శ్రావణి."నేను రాజమండ్రిలో శ్రీనివాసా ట్యుటోరియల్ కాలేజీలో టీచర్ గా వున్నాను. ఈబ్యాంక్ ఉద్యోగం వస్తే మాకష్టాలు తీరినట్లే! నా జీవితంలో బ్యాంక్ ఉద్యోగానికి ప్రయత్నం చేసే ఆఖరి అవకాశం ఇది!"అంది.



— సరిగా గుర్తు లేదు

"మన అనుబంధం ఎన్నెన్ని జన్మల సంబంధమోకదూ, రేవంత్?" తన్మయంగా అడిగింది రేఖ.

"ఏమో రేఖా..నాకు సరిగా గుర్తులేదు!" పరధ్యానంగా అన్నాడు రేవంత్.

అందె అనిత (చిత్తూరు)

## 'లవ్ బర్డ్స్'

ప్రముఖ దర్శకుడు పి.వాసు దర్శకత్వంలో మూడు భాషల్లో నిర్మితమవుతున్న 'లవ్ బర్డ్స్' తప్పకుండా పెద్ద హిట్ అవుతుందని నిర్మాతలు నమ్మకంతో ఉన్నారు. ఖర్చుకు వెనుకాడకుండా పాటల కంపోజింగ్ లండన్‌లో జరిపారు సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహ్మాన్. కొన్ని ముఖ్య సన్నివేశాలను లండన్, స్కాట్‌లాండ్‌లలో చిత్రీకరించారు. హీరో, హీరోయిన్లుగా ప్రభుదేవా, నగ్మా నటిస్తున్నారు. 'మౌనం' ఫెయిల్యూర్‌తో షాక్ తిన్న నగ్మా 'లవ్‌బర్డ్స్' మీద ఎన్నో ఆశలు పెట్టుకుంది.

ఎస్.ఆర్.ఆర్.






## అభిమానుల బాధ

హీరో కృష్ణ కొన్ని చిత్రాల్లో ప్రత్యేక తరహా పాత్రల్లో గెస్ట్‌గా నటిస్తూ పాటలు పాడటం అభిమానులకు నచ్చడంలేదు. 'యమలీల, శుభమస్తు' చిత్రాల్లో ఒక్కో పాటలో నటించి చాలా బాగా చేశాడని కృష్ణకు మంచి పేరు రావటంతోపాటు ఆ చిత్రాలూ హిట్ అయ్యాయి. అయినా అభిమానులకు కృష్ణ అలా నటించటం ఇష్టంలేదు. ఇదే విషయాన్ని అభిమానులు కృష్ణకు చెప్పినట్టు తెలుస్తోంది. దీనికి కృష్ణ ఎలా స్పందిస్తారో చూడాలి!

ఎస్.ఆర్.ఆర్.



### జీవితభీమా

"మా ఆవిడ్ని ఆటపట్టించాలని ఉత్తినే నాకు బ్రెయిన్ ట్యూమర్ ఉందని డాక్టర్ చెప్పాడని చెప్పాను," రవితో అన్నాడు చంద్ర.

"ఏంచేసిందీ...బాధపడి ఏడ్చిందా?" అడిగాడు రవి.

"కాదు..త్వరగా నన్ను జీవితభీమా చెయ్యమంది!"

"..?!.."

అండె అనిత (చిత్తూరు)

సంధ్య రెండు గ్లాసుల్లో నిమ్మ రసం తెచ్చి ఇద్దరికీ ఇచ్చింది.

"మీరూ తెచ్చుకోండి" గ్లాసు అందుకుంటూ అంది శ్రావణి.

సంధ్య లోపలికి వెళ్లింది.

"మీకు తెలిసున్న వాళ్లకు చెప్పి ఈజాబ్ నాకు వచ్చేలా సాయం చేయగలరా?"

సారధి పెద్దగా నవ్వి "ఇదేమయినా ప్రైవేటు కంపెనీ ఉద్యోగమా? బ్యాంకింగ్ రిక్రూట్ మెంట్ బోర్డ్ కండక్ట్ చేసే పరీక్షలు ఇవి! పరీక్ష పాసయిన మిమ్మల్ని ఏబ్యాంక్ కి అలాట్ చేస్తారో తెలియదు!"

శ్రావణి ఆలోచనలో పడింది.

"మీరు పరీక్ష బాగా రాసారు. తప్పక పాస్ అవుతారు! ఉద్యోగం కూడా వస్తుంది.స్వశక్తి మీద జాబ్ సంపాదించుకున్న తృప్తి మీకుంటుంది!"

"మీ బెస్ట్ విషెస్ కి థాంక్స్!"

సంధ్య తన కోసం నిమ్మరసం తెచ్చుకున్నాకే, తను తాగింది శ్రావణి.

"చీకటి పడబోతోంది—ఇంకా నా సూట్ కేసు కూడా సర్దుకోలేదు, వెళతాను!" అంటూ లేచింది శ్రావణి.

సంధ్య లోనికెళ్లి కుంకుమ భరిణె, బంగినపల్లి మామిడి పండు తీసుకు వచ్చి శ్రావణికి ఇచ్చింది.

ఆమెను సాగనంపడానికి వీథి గేటు దాకా వచ్చాడు సారథి."మీ కోసమే అన్నట్లుగా ఒక్కటే గులాబీ పూసిందీరోజు. నేనిచ్చిన మాట నిలబెట్టుకున్నాను!"అన్నాడు.

"థాంక్ యూ వెరీమచ్!" అతని చేతిలోని గులాబీని అందుకుంది శ్రావణి.

* * *

నెల రోజుల తరువాత మొట్టమొదటిసారి ట్యుటోరియల్ కాలేజీకి తన పేరున పోస్టు కవరు రావడంతో ఆశ్చర్యపోయింది శ్రావణి. కవరు మీద పరిచయం లేని దస్తూరి! ఏదో ఆలోచిస్తూ కవరు చింపింది. లోపల గులాబీ రంగు కాగితం. అందంగా పొందికగా ఉన్న దస్తూరి. అడుగున సంతకం చూసింది. "సారథి" అని ఉండడంతో గబగబా ఉత్తరం చదవడం ఆరభించింది.

శ్రావణి గారికి,

ఓ గులాబీ చేతిలో పెట్టి, అభ్యర్థించగానే ఆఅభ్యర్థనను మన్నించి మాఇంటికి వచ్చి, నాకు మహోపకారం చేసినందుకు చాలా చాలా థాంక్స్! నేనేం సహాయం చేశానని ఆశ్చర్యపోకండి. ఆసహాయం గురించి తెలియాలంటే మీకు మాగురించి కొంచెం చెప్పాలి. నాది.బ్యాంకులో క్లర్కు ఉద్యోగం, ఏప్రత్యేకతలూ లేని సగటు మగాడిని. మాఆవిడ సంధ్యని చూశారుగా. ఆవిడ అందగత్తె కాదని ఎవరూ అనరు. అయితే అందాన్ని మించి అహం ఉంది సంధ్యలో. తన అందానికి నేను అసలు తగనని ఆమె ఉద్దేశ్యం. నాతో సినిమాకి గాని ఆఖరికి గుడికి కూడా రావడానికి తను ఇష్టపడదు. తన తండ్రికి కట్నం ఇచ్చుకునే తాహతు ఉంటే తన అందానికి ఏ డాక్టరో, ఇంజనీరో భర్తగా వచ్చి ఉండేవాడనీ తన నమ్మకం. కట్నం తీసుకోకుండా నేను పెళ్లి చేసుకున్నందుకు ఆమె దృష్టిలో నేనొక దోషిని. నేను కట్నం అడగలేదనే వాళ్ల నాన్న ఇల్లు అమ్మే ప్రయత్నం మాని, ఈపెళ్లి చేసి తన గొంతు కోశాడని ఆమె కోపం. సంధ్యతో పెళ్లికి ముందే మాక్లాస్ మేట్ రాజారామ్ దూరపు బంధువుల అమ్మాయి శ్రావణితో నా పెళ్లి మాటలు నడిచాయి. క్రితం ఆగస్టులో శ్రావణితో పెళ్లి చూపులకి ఏర్పాట్లు కూడా జరిగాయి. అయితే నాకు సంధ్యతో రాసి పెట్టి ఉండగా ఆ పెళ్లి ఎలా జరుగుతుంది? మా అమ్మకి మూడోసారి మైల్డ్ గా హార్ట్ ఎటాక్ రావడంతో వెంటనే నా పెళ్లయిపోవాలనీ, అదీ తనకి హాస్పిటల్ లో సహాయం చేసిన రామనాథంగారి అమ్మాయి సంధ్యతోనే జరగాలని పట్టుపట్టింది. సంధ్య నాకు నచ్చింది. అమ్మ కోరిక ప్రకారం ఆగస్టు మొదటి వారంలోనే నా పెళ్లి సంధ్యతో జరిగిపోయింది. సంధ్యకి నామీద కోపం అనీ, అందంగా లేనని నేనంటే అసహ్యం అనీ పెళ్లయిన వారం రోజుల్లోనే తెలిసి పోయింది. తను నన్ను దెప్పినపుడు కోపంతో"నీకన్నా అందంగా ఉండే శ్రావణితో నాపెళ్లి జరిగిఉండేది, హాస్పిటల్ లో మా అమ్మకి పరిచయం అయిన మీ నాన్న ఆపెళ్లి జరగకుండా అడ్డుపడ్డాడు." అనేవాడిని.

కాకతాళీయంగా మీరు పరీక్ష రాసేటపుడు మీ పేరుచూశాను. అంతకన్నా ఆశ్చర్యంగా ఆసాయంత్రం మిమ్మల్ని మా ఇంటి ముందు చూశాను. సంధ్యకి మిమ్మల్ని ఆ శ్రావణిగా పరిచయం చేశాను. సారీ ఏమీ అనుకోరుగా?! మిమ్మలి చూశాక సంధ్యలో ఇన్ ఫీరియారిటీ కాంప్లక్స్ మొదలయ్యింది. మీరు సహజంగానే సంధ్య కన్నా చాలా అందంగా ఉన్నారు. ఇపుడు సంధ్య గిరిగీసుకుని కాకుండా నాతో చాలా బాగా ఉంటోంది. మంచి మార్పు వచ్చింది. ఇపుడే ఫస్ట్ షోకి వెళ్లి వచ్చి భోజనం చేశాం. సంధ్య పడుకుంది. మీకు ఈ విషయాలన్నీ రాసి థాంక్స్ చెప్పాలని అనిపించింది. అసలు ఆరోజు అతను ప్రత్యేకంగా తనని ఇంటికి రమ్మని ఎందుకు పిలిచినట్లు? నిమ్మరసం తాగడానికా? అనుకునే మీ అనుమానం ఈ ఉత్తరం ద్వారా తీరుతుందని అనుకుంటున్నాను.

మరోసారి మీకు థాంక్స్ చెబుతూ—

సారథి.

చదివేసిన గులాబీ రంగు కాగితం కవరులో పెట్టేస్తూ "అయితే అప్పట్లో రాజారాం అన్నయ్య చెప్పిన సారథి ఇతడేనన్నమాట!"అనుకుంది శ్రావణి బరువుగా నిట్టూరుస్తూ.

●